

మంచి నీటి కోసం మున్సిపల్ ట్యాంకర్ వద్ద బారులు తీరిన ప్రజలు


నిర్మల్‌లోని ఓ మినరల్ వాటర్ ప్లాంటు వద్ద క్యాన్లలో నీటిని నింపుతున్న దృశ్యం

# ఇదేం సర్కారురా బాబూ..

*ఒకవైపు నీటి సమస్య.. మరోవైపు చీకటులు..*

**కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్న ప్రజలు**

- సరిగ్గా నీళ్లియ్యరూ, కరెంటియ్యరూ..
- వేసవి కాలం ప్రారంభంలోనే మొదలైన నీటి కష్టాలు
- తాగునీటికి కిలోమీటర్ల దూరం వెళ్తున్న ప్రజలు
- చీకట్లో మగ్గుతున్న కాలనీవాసులు
- ఖాళీ బిందెలతో మహిళలు, స్థానికుల ధర్నా


స్ట్రీట్ లైట్లు వేయకపోవడంతో అంధకారంలో ఇండ్లు

***ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పరిస్థితులు మళ్లీ ఉత్పన్నం అవుతున్నాయి. తాగు నీటికి ధర్నాలు, రాస్తారోకోలు చేసిన రోజులు గుర్తుకొస్తున్నాయి. గత పదేండ్లుగా కేసీఆర్ సర్కారు తాగు, సాగు నీటికి ఢోకా లేకుండా చేసింది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే నీటి కష్టాలు మొదలయ్యాయి. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో వేసవి కాలం ప్రారంభంలోనే నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. సమస్య ఉందని తెలిపినా అధికారులు స్పందించడం లేదు. కనీసం, కరెంటు బల్బ్ కూడా పెట్టమంటే పెట్టక పోవడంతో కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. ఫలితంగా జనం నీటికి అవస్థలు పడుతున్నారు. ఇదేం సర్కారురా బాబూ అంటూ నిందిస్తున్నారు.***

ఖానాపూర్, మార్చి 10 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ శివారులోని కుమ్రం భీం చౌరస్తాలో కేసీఆర్ సర్కారు అన్ని హంగులతో 400 మంది నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించింది. 2023 సంవత్సరంలో అధికారులు సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసింది. ఇందులో ఏ, బీ, సీ బ్లాకులను ఏర్పాటు చేయగా.. 17 అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. ఒక్కో బిల్డింగ్‌లో 24 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కరెంట్ సరఫరా, తాగు నీటి వసతికి రెండు బోర్లను ఏర్పాటు చేసి సకల వసతులను కల్పించింది. ప్రజల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించి అర్హులకు అందజేశారు. కానీ.. పది రోజుల క్రితం బోర్లు పాడైపోవడంతో లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. తాగు నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తున్నదని, ఐదు అపార్ట్‌మెంట్‌ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొంటున్నారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో కాలనీలో విద్యుత్ స్తంభాలకు లైట్లు కూడా పెట్టలేదని మహిళలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ప్రత్యేక ప్రణాళికను తయారు చేసి తమకు తాగునీటి సమస్య నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు. రెండు రోజుల క్రితం ఖానాపూర్ మున్సిపాలిటీ ఎదుట బిందెలు, బకెట్‌లతో నిరసన తెలిపారు. లేని పక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యంను వివరణ అడుగగా.. రెండు వాటర్ ట్యాంకర్లతో ఉదయం, సాయంత్రం తాగు నీటిని అందిస్తున్నామని, మరో రెండు ట్యాంకర్లతో కూడా అందించడానికి ప్రణాళికలను సిద్ధం చేశామని తెలిపారు.

### సొంత డబ్బులతో బోరు వేసుకున్నాం..



ఖానాపూర్ మున్సిపల్ పరిధిలోని కుమ్రం భీం చౌరస్తా వద్ద కొత్తగా ఇచ్చిన డబుల్ బెడ్రూం ఇండ్లలో పది రోజుల నుంచి తాగు నీరు రావడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్లు కాలిపోయినవి. దీంతో కిలోమీటరు దూరం నుంచి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నం. ఎండాకాలం మొదలు కావడంతో నీటి సమస్య తీవ్రమైంది. రెండు రోజుల కింద 50 మందిమి కలిసి సొంత డబ్బులతో బోరు వేసినప్పటికీ నీళ్లు పడలేదు. తాగు నీటి సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.
**- కొమెర్ల గోవిందమ్మ, స్థానికురాలు, కుమ్రం భీం చౌరస్తా.**

### ట్యాంకర్ నీరు సరిపోవడం లేదు..



మున్సిపాలిటీ వాళ్లు నిన్నటి నుంచి ట్యాంకర్ల ద్వార తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వచ్చే కొద్దిపాటి నీటిని డ్రమ్ములు, డబ్బాల్లో నిల్వ చేసుకుని పొదుపుగా వాడుకుండున్నాం. నీరు చాలక తప్పని పరిస్థితిలో మంచినీటిని కొనుగోలు చేయాల్సి వస్తున్నది. రోజుకు రెండు సార్లు వాటర్ ట్యాంకర్ రావడంతో మంచినీరు సరిపోవడం లేదు. ట్యాంకర్ వద్ద నీటి కోసం ఉదయం లేచిన నుంచి క్యూలైన్ కడుతున్నాం. తాగు నీటి కష్టాలకు ఉన్నత అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.
**- న్యాతరి అంజి, స్థానికుడు, కుమ్రం భీం చౌరస్తా.**

# మినరల్ దందా

**పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వాటర్ ప్లాంట్లు**

- అపరిశుభ్రత నీటినే క్యాన్లలో నింపుతున్న నిర్వాహకులు
- నాణ్యతలేని నీటిని సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం
- బీఐఎస్ అనుమతి లేకున్నా ప్లాంట్ల నిర్వహణ
- పట్టించుకోని అధికార యంత్రాంగం


భైంసా రోడ్డులో నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న ప్లాంటు

నిర్మల్, మార్చి 10(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో మినరల్ వాటర్ పేరిట జనరల్ వాటర్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అనుమతులు లేకుండా ప్లాంట్లను ఏర్పాటు చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. వేసవి రాగానే కాసులు కురిపించే వ్యాపారంలా మారింది. ముఖ్యంగా జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లో కూడా వాటర్ ప్లాంట్లు వెలుస్తున్నాయి. ఆయా ప్లాంట్లలో బోరు ద్వారా నీటిని సేకరించి సక్రమంగా శుద్ధి చేయకుండానే సురక్షిత జలమంటూ ప్రజలకు అంటగడుతున్నారు. జనావాసాల్లో కూడా అనుమతులు లేకుండా ప్లాంట్లను ఏర్పాటు చేయడంతోపాటు పెద్ద ఎత్తున నీటిని సేకరించేందుకు రెండు, మూడు బోర్లు వేస్తున్నారు. దీంతో సమీపంలోని గృహాలకు చెందిన బోర్లలో నీరు అడుగంటుతున్నది. కొన్ని చోట్ల 500 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీళ్లు పడని పరిస్థితి. ఈ అక్రమంగా నిర్వహిస్తున్న ప్లాంట్లపై స్థానికులు ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. చిన్నచిన్న దుకాణాలు, హోటళ్లను పెట్టుకోవాలంటే మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ.. చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని దర్జాగా ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


ఆటోల ద్వారా యథేచ్ఛగా సాగుతున్న అపరిశుభ్రమైన నీటి అమ్మకాలు

### అనుమతులు లేని ప్లాంట్లను సీజ్ చేస్తాం..



*కొద్ది రోజులుగా నిర్మల్‌తోపాటు శివారు కాలనీల్లో అనుమతులు లేకుండా దాదాపు 10 వరకు వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన సంగతి మా దృష్టికి వచ్చింది. రెండు, మూడు రోజుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిబంధనలు పాటించని, ఐఎస్ఐ సర్టిఫికెట్ లేని ప్లాంట్లను గుర్తించి సీజ్ చేస్తాం. ప్లాంట్లను ఏర్పాటు చేసేవారు ముందస్తుగా అన్ని అనుమతులు తీసుకోవాలి. అలాగే పరిశుభ్రమైన వాతావరణం, జనావాసాలకు దూరంగా ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి.*
**- రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్.**

### ప్రాణాలతో చెలగాటం

నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని ఈద్గాం, భైంసా రోడ్, శాంతినగర్, గాజుల్‌పేట్, విశ్వనాథ్‌పేట్, మంజులాపూర్ ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్లను అక్రమంగా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో కూడా దందా కొనసాగుతున్నది. కనీస జాగ్రత్తలు తీసుకోకుండానే నీటిని విక్రయిస్తున్నప్పటికీ ప్రజారోగ్య శాఖ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలుషిత నీరు తాగడంతో కాలేయ సంబంధమైన వ్యాధులతోపాటు డయేరియా, కలరా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### ఇవీ నిబంధనలు..

వాటర్ ప్లాంట్ ఏర్పాటునకు ముందు నీటిని ఒకటికి రెండు సార్లు పరీక్షించాలి. బోరైతే వాల్టా చట్టం కింద స్థానిక తహసీల్దార్ అనుమతి తీసుకోవాలి. అలాగే ఐఎస్ఐ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) నుంచి సర్టిఫికెట్ పొంది ఉండాలి. ప్లాంటులో ప్రయోగశాలను ఏర్పాటు చేసి రంగు, రుచి, వాసన, లవణాల సాంద్రత, సల్ఫేడ్, మాంగనీస్, కాపర్ వంటి 51 రకాల పరీక్షలను చేయాలి. ఆ తర్వాతనే ప్లాంట్లకు అనుమతులు మంజూరు చేయాలి. కానీ.. నిర్మల్ జిల్లాలో ఐఎస్ఐ, బీఐఎస్ ఆమోదం లేకుండానే నీటి శుద్ధి ప్లాంట్లను నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బీఐఎస్ ప్రమాణాల ప్రకారం 20 లీటర్ల నీటిని శుద్ధి చేయడానికి రూ.18 వరకు ఖర్చు అవుతున్నది. కానీ.. ప్రమాణాలు పాటించకుండా వ్యాపారులు 20 లీటర్ల నీటిని రూ.5లకే శుద్ధి చేసి మార్కెట్‌లో రూ.20 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. ఇవే నీటిని చల్లబరిచి 15 లీటర్ల క్యాన్లను రూ.50 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. అలాగే నీటిని నింపే క్యాన్స్ (డబ్బాలు) పాలిథిలిన్, పాలీప్రొఫలైన్‌తో తయారు చేయాలి. ఈ క్యాన్ల ధర దాదాపు రూ.300 నుంచి రూ.400 వరకు ఉంటుంది. స్థానిక నీటి వ్యాపారులు కేవలం రూ.100తో తయారు చేసిన నాణ్యత లేని డబ్బాలను ఉపయోగిస్తున్నారు. ఆహార భద్రతా ప్రమాణాల చట్టం 2006, సెక్షన్ 79,80ల ప్రకారం నీటి శుద్ధి ప్లాంట్లు కచ్చితంగా బీఐఎస్ నుంచి లైసెన్సు తీసుకుని ఐఎస్ఐ గుర్తింపు పొందాలి.

### ఐఎస్ఐ మార్క్ తప్పనిసరి

ప్యాకేజీ డ్రింకింగ్ వాటర్, ప్యూరిఫైడ్ వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లపై కచ్చితంగా ఐఎస్ఐ మార్క్ ఉండాలి. బీఐఎస్ ఇచ్చిన బ్యాచ్ నంబర్‌తోపాటు నీటిని శుద్ధి చేసి విక్రయిస్తున్న వారి పూర్తి చిరునామా వాటిపై ముద్రించాలి. ఇవేమి పాటించకుండా ఇష్టానుసారంగా నీటి వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా అక్రమంగా నీటి దందా యథేచ్ఛగా సాగుతున్నది. అధికారులు నిబంధనలను పాటించని ప్లాంట్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## ఒంటికాలుపై నిరసన

ఒంటికాలుపై నిలబడి నిరసన తెలుపుతున్న సాధన కమిటీ సభ్యులు

ఎదులాపురం, మార్చి 10 : ఆదిలాబాద్ టు ఆర్మూర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఎదుట రైల్వే సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిహారదీక్ష ఆదివారం నాటికి 55వ రోజుకు చేరుకున్నది. ఇందులో భాగంగా సాధన కమిటీ సభ్యులు ఒంటికాలుపై నిలబడి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ చైర్మన్, ప్రధాన కార్యదర్శులు సిర్ర దేవేందర్, నిమ్మల నరేందర్, సభ్యులు మెస్రం భాస్కర్, రామాంజనేయులు, రాములు, రఫిక్, లక్ష్మణ్, ఎండీ ముజీబ్, వెంకటేశ్, ఎండీ ఖాసీం, రమేశ్ ఉన్నారు.



రిమ్స్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

## వేతనాలు ఇవ్వాల్సిందే..

ఎదులాపురం, మార్చి 10 : రిమ్స్, సూపర్‌స్పెషాలిటీ దవాఖానల్లో పనిచేస్తున్న కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రిమ్స్ ప్రధాన గేటు ఎదుట కార్మికులు చేపట్టిన ధర్నా ఆదివారం నాటికి రెండో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల విషయంలో రిమ్స్ డైరెక్టర్ స్పందించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముజీబ్, రిమ్స్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ఖాసీం, అధ్యక్షురాలు జి.సంగీత, సీనియర్ నాయకులు లస్మక్క, కమలమ్మ, గంగమణి, రవి, రాజేందర్‌సింగ్‌లు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

సారంగాపూర్, మార్చి 10 : మండలంలోని జామ్ బాలికల గురుకుల విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ రమాకల్యాణి తెలిపారు. ఈ పరీక్షా కేంద్రంలో 423 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 402 మంది హాజరయ్యారు. ఈ పరీక్షకు డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా రాధిక వ్యవహరించారన్నారు.


జామ్ బాలికల గురుకులంలో విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రమా కల్యాణి

## హత్య కేసులో నిందితుడి రిమాండ్

**వివరాలు వెల్లడించిన ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్**


వివరాలు వెల్లడిస్తున్న భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

భైంసా, మార్చి 10 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని సాయికాటన్ ప్రాంతం వద్ద శనివారం సాయంత్రం జరిగిన సయ్యద్ సోహెల్ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వివరాలను వెల్లడించారు. ఓవైసీ నగర్‌కు చెందిన సయ్యద్ సోహెల్, నయాబాదికి చెందిన అబ్దుల్ జుబేర్‌లు ఇద్దరు స్నేహితులని తెలిపారు. కొద్ది రోజులుగా నగదు విషయంలో తగాదా తలెత్తినట్లు పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన ఈ విషయమై వీరి మధ్య గొడవ తలెత్తగా ఇరు కుటుంబాల సమక్షంలో రాజీ కుదిర్చినట్లు తెలిపారు. దీంతో మళ్లీ ఇద్దరు స్నేహితులుగా మారిన క్రమంలో శనివారం సాయంత్రం సోహెల్ కోసం అతని ఇంటికి అబ్దుల్ జుబేర్ వెళ్లాడు. ఇంటి వద్ద లేకపోవడంతో బస్టాండ్ వద్ద ఉన్నాడని తెలుసుకుని బైక్‌పై వెళ్లాడు. తిరిగి అతనితో కలిసి బైక్‌పై సాయికాటన్ వైపు వస్తుండగా మరోసారి వీరిద్దరి మధ్య గొడవ తలెత్తింది. దీంతో జుబేర్ తన వద్ద ఉన్న టెస్టర్ (స్క్రూ డ్రైవర్)తో సోహెల్‌పై దాడికి దిగాడు. తీవ్రగాయాలపాలైన సోహెల్‌ను స్థానికులు గమనించి ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిజామాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మృతి చెందిన విషయం తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపగా సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. హత్యకు ఉపయోగించిన టెస్టర్‌తో పాటు మొబైల్ ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును ఛేదించిన పట్టణ సీఐ రాజారెడ్డిని ఏఎస్పీ అభినందించారు. ఇందులో పట్టణ సీఐ రాజారెడ్డి, ఎస్‌ఐలు షరీఫ్, గౌసొద్దీన్, కానిస్టేబుల్‌లు ఉన్నారు.

## కుష్ఠుపై ఇంటింటా సర్వే

- నేటి నుంచి 24 వరకు బాధితుల గుర్తింపు
- 557 బృందాలు.. 1,114 మంది సభ్యులు..
- నిర్మల్ జిల్లాలో 72 మంది వ్యాధిగ్రస్తులు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 10 : కుష్ఠు వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ నెల 11 నుంచి 24వ తేదీ వరకు వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేపట్టాలని నిర్ణయించింది. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి, ప్రత్యేకంగా పరీక్షలు చేయనున్నది. నిర్మల్ జిల్లావ్యాప్తంగా 1,74,491 కుటుంబాలు ఉండగా.. ఇంటింటి సర్వే చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం 557 బృందాలు.. 1,114 మంది సభ్యులు, 115 మంది సూపర్‌వైజర్లను నియమించింది.

### వ్యాధి లక్షణాలు..

ఇది మైక్రో బ్యాక్టీరియా లెప్రే అనే సూక్ష్మక్రిమి ద్వారా సోకుతున్నది. శరీరంపై తెల్లమచ్చలు నునుపుగా ఉండి మెరుస్తున్నట్లయితే పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకుంటే వ్యాధిబారిన పడకుండా ఉంటాం. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. వ్యాధి గ్రస్తులతో ఎక్కువ కాలం ఉండడం వల్ల వ్యాధిబారిన పడుతాం. సరైన అవగాహన లేకపోవడం వల్ల వ్యాధి విస్తరిస్తున్నది. వ్యాధి సోకిన తర్వాత మూడు నుంచి 15 ఏళ్ల వరకు వ్యాధి వల్ల కలిగే పరిణామాలు బయట పడతాయి. సరైన చికిత్స అందకపోతే అంగవైకల్యానికి గురవుతారు.


ఇంటింటా సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

### ఉచితంగా చికిత్స..

వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ దవాఖానలో ఉచితంగా చికిత్స అందిస్తారు. మందులు కూడా పంపిణీ చేస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి 6 నుంచి 12 నెలలపాటు వైద్యులు చికిత్స అందిస్తారు. ఒకటి నుంచి ఐదు మచ్చలుంటే పీబీ(అంటు రకం కానిది) చికిత్స ఆరు నెలలు అందిస్తారు. ఆరు కంటె ఎక్కువ మచ్చలుంటే ఎంబీ(మల్టీ బ్యాచిలరీ అంటురకం)గా గుర్తించి యేడాదిపాటు చికిత్స అందిస్తారు. కాగా.. సర్వే బృందాలకు ప్రజలు సహకరించాలని, బృందాలలో ఆడ, మగ సిబ్బంది ఉంటారని తెలిపారు.

## అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే రామారావు పటేల్
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తానూర్, మార్చి 10 : అన్నివర్గాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 106 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లింగమూర్తి, ఇన్‌చార్జి మండల అభివృద్ధి అధికారి మోహన్‌సింగ్ పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్